



సాయంకాలం. పార్కులో విరియపూచిన చెట్లూ, రోడ్ల అంచున బారులు బారులుగా వేసిన మొక్కలనిండా రంగు రంగుల పువ్వులు. తీర్చి కట్టిన మళ్లలోని మొక్కలకు రకరకాల పూలగుత్తులు. విశాలమైన పచ్చికబయళ్లు, గంతులువేస్తూ ఆడుకునే, పిల్లలు. క్రిక్కిరిసి కూర్చున్న జనం. వచ్చీపోయే జనసమూహం. ప్రశాంతంగా కూర్చోడానికి వీలులేనంత సమ్మర్దం. ఈ రొదలోంచి దూరంగా పోవాలని పార్కు అంచునఉన్న కాలవగట్టునుపట్టి పోయింది మీనాక్షి. నిర్జనం. ఏకాంతంగా కూర్చుని ప్రక్కని కాలవలో స్తబ్దంగా ఉన్న నీటిని చూస్తూ కూర్చుంది మీనాక్షి.

నీటిఅంచునే చేపలకోసం గాలంవేసి తదేకదృష్టితో కాచుకు కూర్చున్న మోహన్‌కి ఇతర ప్రపంచ మేమీ తెలియదు. పాపం మధ్యాహ్నంనుంచీ ఒక్కచేపకూడా గాలానికి తగలలేదు. ప్రొద్దుగూకింది. నిస్పృహతోనూ చిరాకుగానూ గాలాన్ని నీటిలోంచి రివ్వున పైకి లాగేసరికి గాలాం ముల్లు వెళ్ళి మీనాక్షి తల వెంద్రుకలలో చిక్కుకుంది. చిక్కిందిరా చేప! వెనక్కి తిరిగి చూచాడు చిక్కు విడదీసుకోడానికి ప్రయత్నిస్తున్న మీనాక్షిని. గబగబా కాలువ గట్టెక్కి ఆమెను సమీపించి తలలో చిక్కుకున్న కొక్కాన్ని తీయబోతూ ఆమె కళ్లల్లోకి ఒక్కసారి చూచాడు. తళుక్కుమని మెరిశాయి. ఆమె చేతు లెంత మృదువుగా ఉన్నాయి! మోహన్ ఎంత అందంగా ఉన్నాడు! ఆ సౌందర్యమూర్తి ప్రథమదర్శనం మీనాక్షిని ముగ్ధురాలిని చేసింది. అప్రయత్నంగా అత డామె ముఖాన్ని రెండు చేతులతోనూ దగ్గరగా తీసుకున్నాడు. ఆమె కళ్లనీ, ముఖాన్నీ పెదవుల్నీ ముద్దుపెట్టుకున్నాడు.

వారి ఆనందానికి అంతరాయం కలిగించిం దొక చిరునవ్వుతో కూడిన సకిలింపు. విడిపోయి ఇద్దరూ అటు చూచారు. మీనాక్షి తమ్ముడు పండూ! చెట్ల గుబుర్లలో నుంచి ఉదయించాడు. విస్తుపోతూ చూస్తున్న మీనాక్షిని "అమ్మతో చెప్తా నుండు" అని బెదరించాడు. "అమ్మతోనే కాదు. ఎవరితోనూ చెప్పకు. ఇదిగో! ఇదితీసుకుని ఏమైనా కొనుక్కో" అని మోహన్ అతని జేబులోకి ఒక రూపాయి కుక్కాడు.

అప్పటినుంచీ ప్రతిరోజూ అక్కయ్యతో పికారు మానలేదు పండూ. "ఏయ్ పండూ! నువ్వు మహామాంచి పిల్లవాడవు కదూ! ఇవిగో చాకొలేట్లు! మరి ఎవరికీ చెప్పకేం!"

పండూకి ఇంక రోజూ ఫలహారాలే. బహుమానాలే. ఒక టేమిటి? మిఠాయీలు, బిస్కట్లూ, బంతులూ, బొమ్మలూను. "అక్కయ్యా! నాకు చిన్న వాచీ పెట్టుకోవాలని ఉంది. ఇస్తావా లేకపోతే నీసంగతి అమ్మతో చెప్పమంటావా?"

"సరే! కేకలు పెట్టకు. కొని పెడతాలే. గమ్మునఉండు!"

కొన్ని రోజులు గడచాయి. మీనాక్షిని మోహన్ కిచ్చి వివాహం చేయడానికి ఆమె తల్లిదండ్రులు అంగీకరించారు. ఆ సాయంకాలం పార్కు పక్క కాలవవొడ్డున చెట్ల గుబుర్లలో మోహన్, మీనాక్షీ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. పండూ సకిలింపు వినబడింది. మీనాక్షి లేచి పరుగెత్తుకుని వెళ్ళి పండూచెవి పట్టుకుంది. మోహన్ రెండో చెవి పట్టుకున్నాడు. మెలిపెట్టడం మొదలుపెట్టారిద్దరూ. వాచీకి కీ ఇవ్వవద్దూ మరి?

"చెప్పను బాబోయ్! చెప్పను. చెప్పను" అంటూ ఏడవడం మొదలెట్టాడు పండూ.

"చెప్పవూ? చెప్పాలి. నిజమైన వాచీ కావాలంటే ఇంక అందరితోనూ చెప్పాలి తెలిసిందా?" అన్నాడు మోహన్ నవ్వుతూ.

"ఓహో! అదా? చెప్పరేం మరి? తెలిసిం దిప్పుడు" అంటూ ఏడుపుమాని "అక్కయ్యకూ సీమంతం, చక్కన్ని బావకు ఆనందం" అని పాడుకుంటూపోయాడు పండు. ★